క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పని చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కామర్స్, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్‌లో ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. పీజీలో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ వారికి 50 శాతం మార్కులు ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. పీహెచ్‌డీ, ఎన్‌ఈటీ, ఎస్‌ఎల్‌ఈటీ, సెట్ ఉన్న వారికి, బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24లోపు ఇచ్చోడ లేదా ఆదిలాబాద్ కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

జీవో 49ని రద్దు చేయాలి

సిరికొండ: ఆదివాసీ హక్కులను కాలరాసే 49 జీవోను రద్దు చేయాలని సోమవారం ఆదివాసీ బంద్‌ను ప్రకటించడం జరిగిందని ఆదివాసీ నాయకులు అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. వ్యాపార సముదాయలు బంద్ చేసి సహకరించాలని కోరారు.

టీఏజీఎస్ నుంచి బహిష్కరణ



మాట్లాడుతున్న విష్ణు

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) నుంచి ఉట్నూర్ మండల అధ్యక్షుడిగా పని చేస్తున్న కనక మలుకును బహిష్కరిస్తున్నట్లు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు తెలిపారు. ఆదివారం ఉట్నూర్‌లోని ఆదివాసీ భవన్‌లో సంఘం జిల్లా కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నిబంధనలకు వ్యతిరేకంగా, క్రమశిక్షణకు వ్యతిరేకంగా ఆయన ప్రవర్తించడంతో బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయనకు సంఘానికి ఎటువంటి సంబంధం లేదని ఆదివాసీ ప్రజలు, విద్యార్థులు గమనించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్రం తనుష్, మడవి నాగోరావ్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

తలమడుగు: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా నియమితులైన ఇండ్ల శశికాంత్‌ని, బీజేపీ మండల అధ్యక్షుడు నక్క ధనంజయను, కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడిగా చెన్నాల సాయి కిరణ్‌ను మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అంబేడ్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న మాట్లాడుతూ జిల్లాస్థాయి పదవులు అదే విధంగా మండల స్థాయి పదవులు వచ్చినటువంటి ఇరువురిని అభినందిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గూకుంటి క్రాంతి కుమార్, నిమ్మల గజానంద్, మగిడి ప్రకాష్, గడుగు పోచ్చన్న, నేతుల గంగన్న, బాతురి నరసింహులు, ముత్యాల రవి, కిరణ్, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంత్రి 'జూపల్లి'ని కలిసిన ఆత్మ చైర్మన్



మంత్రి జూపల్లితో గొర్ల రాజుయాదవ్

బోథ్: బోథ్ బ్లాక్ నూతన ఆత్మ చైర్మన్‌గా నియమితులైన గొర్ల రాజుయాదవ్ ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును హైదరాబాద్ సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనను ఆత్మ చైర్మన్‌గా నియమించినందుకు మంత్రి గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి మరింత నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేయగా, మంత్రి సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

కష్టపడి చదవాలి

నేరడిగొండ: కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని బుగ్గారం(బి) గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యువ నాయకుడు రాథోడ్ సురేందర్ చిన్న నాన్న కుమార్తె రాథోడ్ లావణ్య ఐఐటీలో ఆల్ ఇండియా 803వ ర్యాంక్ సాధించడం పట్ల ఆదివారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామస్థాయి నుంచి ఇంతటి ప్రతిభ చూపడం ఎంతో గర్వకారణమని అన్నారు.

తగ్గిన సన్నబియ్యం ధరలు



దుకాణంలో సన్నబియ్యం నిల్వలు

- మూడు నెలల రేషన్ పంపిణీ ఎఫెక్ట్
- బహిరంగ మార్కెట్లో తగ్గిన కొనుగోళ్లు

బోథ్: ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు సన్నబియ్యం సరఫరా చేస్తుండటంతో బహిరంగ మార్కెట్లో సన్నబియ్యం కొనుగోళ్లు తగ్గిపోయాయి. రేషన్‌కార్డు దారులకు మూడు నెలలకు సరిపడా సన్నబియ్యం సరఫరా చేయడంతో బహిరంగ మార్కెట్‌లో వివిధ రకాల సన్నబియ్యం ధరలు క్రమంగా తగ్గుముఖం పట్టాయి. జూన్ నెల నుంచి పడిపోతున్న ధరలు జులై నాటికి క్వింటాలుకు రూ.1000 వరకు తగ్గాయి. మధ్య తరగతి ప్రజలకు, రేషన్ కార్డు లేనివారికి కూడా ప్రస్తుతం సన్నబియ్యం ధరలు కొంత మేరకు అందుబాటులోకి వచ్చాయి.

ఒకేసారి మూడు నెలల బియ్యం పంపిణీ..

జిల్లాలో 2,05,246 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. 6,87,785 యూనిట్లు ఉన్నాయి. గత నెలలో ప్రభుత్వం మూడు నెలల అవసరానికి సరిపడా బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేసింది. వీరికి 1,21,74,590 క్వింటాళ్ల బియ్యాన్ని సరఫరా చేశారు. దీనివల్ల చాలా కుటుంబాలకు కనీసం రెండు నెలల బియ్యం ఇళ్లకు చేరింది. ఇక రేషన్ కార్డుల్లేని చాలా కుటుంబాలు బహిరంగ మార్కెట్‌లో బియ్యం కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో సరఫరా ఎక్కువగా ఉండటం, డిమాండ్ తక్కువగా ఉండటం ధరల తగ్గుదలకు ప్రధాన కారణంగా నిలిచింది.

ఇతర రాష్ట్రాల్లోనూ తగ్గిన గిరాకీ..

తెలంగాణతో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా సన్నబియ్యానికి గిరాకీ తగ్గిపోవడంతో ధరలు పడిపోయాయి. సరఫరాకు బియ్యం మిల్లులు, రేషన్ షాపుల్లో మంచి నిల్వలు ఉండటంతో మరింతగా తగ్గుదల చోటు చేసుకుంది. దీంతో ధరలు పడిపోతుండటంతో బియ్యం వ్యాపారులు నాణ్యతపై దృష్టి పెట్టారు. ప్రజా పంపిణీ ద్వారా ఇచ్చే బియ్యంలో 20–30 శాతం వరకు నూకలు ఉండటానికి అనుమతించినా, అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రం కేవలం 10 శాతమే అనుమతించారు. ఈ నేపథ్యంలో బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు వంద శాతం నాణ్యమైన బియ్యాన్ని విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీని వల్ల వినియోగదారులకు మంచి నాణ్యత గల బియ్యం అందనుంది. మొత్తంగా చెప్పాలంటే, రేషన్ ద్వారా పెద్దఎత్తున సరఫరా, బహిరంగ మార్కెట్లో డిమాండ్ తగ్గడం, ఇతర రాష్ట్రాల్లోనూ గిరాకీ తగ్గిపోవడం వంటి కారణాలతో సన్నబియ్యం ధరలు గణనీయంగా తగ్గాయి. వినియోగదారులకు ఇది ఊరట కలిగించే పరిణామంగా కనిపిస్తోంది.

బియ్యం ధరలు క్వింటాలుకు..

రకం	మే	జూలై	తగ్గుదల
జైశ్రీరాం	రూ.6500	రూ.4900	రూ.1600
సాంబ మసూరి	రూ.6000	రూ.4700	రూ.1300
స్టీంరైస్	రూ.5000	రూ.3900	రూ.1100



సిడాం శంభు ఆశయ సాధనకు కృషి చేయాలి

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన మలిదశ ఉద్యమకారుడు సిడం శంభు ఆశయాల సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండలంలోని మత్తడిశంభుగూడలో సిడం శంభు 7వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీల హక్కుల కోసం నిత్యం కొట్లాడిన ఉద్యమ నేత సిడాం శంభు అని కొనియాడారు. సమాజహితం కోసం పాటు పడిన ఉద్యమ నాయకుడి కుటుంబానికి మనమంతా కలిసి అండగా ఉండాలన్నారు. కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, మాజీ ఎంపీపీ జైవంత్‌రావు, పుర్కబాపురావు, సిడం శంభు కుటుంబీకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ప్రతీఒక్కరిలో భగవంతుడు ఉన్నాడు

ఆదిలాబాద్: ప్రతీఒక్కరిలో భగవంతుడు ఉన్నాడని హైదరాబాద్ రామకృష్ణ మఠం ప్రతినిధి శ్రీ తత్పదానంద స్వామి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శ్రీరామకృష్ణ సేవా సమితి కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. శ్రీరామకృష్ణ పరమహంస, శ్రీ శారదా మాత, శ్రీ స్వామి వివేకానంద చిత్రపటాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద మంత్రాలు పఠించి, పలు గీతాలను ఆలపించి శ్రీరామకృష్ణ పరమహంస, వివేకానందుని సందేశాన్ని భక్తులకు ప్రబోధించారు. రామకృష్ణ సేవా సమితి కార్యాలయాలు ఆధ్యాత్మికతను పెంచడంతో పాటు స్వామి వివేకానంద సూక్తులను యువత వద్దకు తీసుకెళుతున్నాయన్నారు. ఇటీవల శారద మాత జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రియాంక, సౌమ్య, శ్రీజలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర మాజీ కన్వీనర్ సూర్య ప్రకాష్, పవన్, ఆరే భూమన్న, కోరెడ్డి లెనిన్, లసమయ్య, కోటేశ్వరరావు, రవి శంకర్, హన్మండ్లు, శ్రీధర్, శ్రీకాంత్, సాయి, ప్రశాంత్, గణేష్ పాల్గొన్నారు.



విజేతలతో స్వామీజీ, సమితి సభ్యులు

రామాలయంలో భగవద్గీత పారాయణం

బోథ్: సొనాల మండల కేంద్రంలోని రామాలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో మహా భగవద్గీత పారాయణం నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త నర్సింగ్ రెడ్డి నేతృత్వంలో భక్తుల బృందం సంపూర్ణ 18 అధ్యాయాలు, 700 శ్లోకాలతో భగవద్గీత పారాయణం నిర్వహించారు. సొనాల గ్రామానికి చెందిన పరమపూజనీయ, స్వర్గీయ సాధు పోశెట్టి చిత్రపటానికి పూలమాల వేసి, ఆయన ఆధ్యాత్మిక సేవలను స్మరించారు. రామాలయ కమిటీ చైర్మన్ జీవీ రమణ మాట్లాడుతూ.. భగవద్గీత సర్వ మానవాళికి ఆదర్శ గ్రంధం. జీవితం ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో గీతలో ఉందన్నారు., కార్యక్రమంలో బాపురెడ్డి, చెట్ల పుష్ప, లక్ష్మారెడ్డి, రమణ, అజాబ్ సింగ్ పాల్గొన్నారు.



భగవద్గీత పారాయణంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా బోనాల పండుగ



బోనాలతో మహిళలు

బోథ్: సొనాల మండల కేంద్రంలో మహర్ మహిళా సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య గ్రామంలోని వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించి పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో పాటిల్ రుక్మాబాయి, తిరుమల, మమత కామెర లత, భగత్ రేఖ, వసుంధర, కమలాబాయి, బౌద్ధ సొసైటీ ఆఫ్ ఇండియా మండల అధ్యక్షుడు అమత్ రావు పాటిల్ పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హస్నాపూర్ గ్రా మంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. అందరు ఆరోగ్యంగా ఉండాలని, పంటలు బాగా పండాలని, వర్షాలు కురవాలని పూజలు చేశారు. మాజీ ఉపసర్పంచ్ నెదునూరి అశోక్, ఉమా, సాయికిరణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వనదేవతలకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఆదివాసీలు

నార్నూర్: మండలంలోని మాన్కాపూర్ శివారులో వన దేవతలకు ఆదివాసీలు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఉదయమే గ్రామ శివారులో సంప్రదాయబద్ధంగా నైవైద్యం సమర్పించి, పూజలు చేశారు. సుఖసంతోషాలతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తోడసం నాగోరావు, గ్రామ పెద్దలు మెస్రం మోతిరాం, కోట్నాక్ పవన్ కూమార్, కుమ్ర సెడ్మారావు, మెస్రం సీతారాం, జుగ్నాక్ హన్మంతరావు, మెస్రం బాదిరావు, రాయిసీడం ఏత్మారాం పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వైద శిబిరానికి రావాలని ఆహ్వానం

బోథ్: స్వాతంత్ర్య సమరయోధుడు లోకమాన్య బాల గంగాధర్ తిలక్ 169వ జయంతిని పురస్కరించుకుని, జూలై 23న బోథ్ మండల కేంద్రంలోని లోకమాన్య నగర్‌లో ఏర్పాటు చేయనున్న ఉచిత వైద్య శిబిరానికి హాజరు కావాలని లోకమాన్య యూత్ సభ్యులు ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆహ్వానించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

సిరికొండ: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలని మండల బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో పార్టీ తరుపున పోటీ చేసి అన్ని స్థానాల్లో భారీ మోజార్టీతో గెలిచి బీఆర్‌ఎస్ సత్తా చాటాలన్నారు. అందుకు ప్రతీ గ్రామంలోని బీఆర్‌ఎస్ కార్యకర్త సైనికుల్లా పని చేయాలని సూచించారు. సమావేశంలో నాయకులు పెంటన్న, తోకల చందు, భీంరావు, బియ్యల మల్లేష్, సూర్యకాంత్, రంజాన్, తదితరులు పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్లు

సిరికొండ: మండల కేంద్రంలో ఉన్న కేజీబీవీ కళాశాల, పాఠశాల్లో స్పాట్ అడ్మిషన్‌లు జరుగుతున్నాయని కేజీబీవీ మండల ప్రత్యేకాధికారి సంధ్య రాణి అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. కళాశాల్లో ఎంపీసీలో 30 సీట్లు, బైపీసీలో 20 సీట్లు అందుబాటులో ఉన్నాయని, పాఠశాల్లో ఆరో తరగతిలో 10 సీట్లు, ఏడో తరగతిలో 3 సీట్లు ఉన్నాయని బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓబీసీ సమ్మేళనానికి ఆహ్వానం

బోథ్: బలహీనవర్గాల హక్కుల కోసం కాంగ్రెస్ దేశ వ్యాప్తంగా ఈనెల 25న ఢిల్లీలో నినిర్వహించే ఓబీసీ నేతల సమ్మేళనానికి బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డికి ఆహ్వానం అందింది. మంత్రి పొన్నం ప్రభాకర్ చైర్మన్ గంగారెడ్డిని ఆహ్వానిస్తూ లేఖ రాశారు. ఢిల్లీలో ఓబీసీ నినాదాన్ని వినిపిస్తామని బొడ్డు గంగారెడ్డి తెలిపారు. దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి ఓబీసీ నేతలు హాజరుకానున్నారని తెలిపారు.

జనావాసాల మధ్య మురుగునీరు

సొత్నాల: మండలంలోని మాంగుర్ల గ్రామంలో జనావాసాల మధ్య మురుగునీరు నిల్వ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దోమల వ్యాప్తి చెంది డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్ లాంటి వ్యాధుల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



ఇళ్ల మధ్య మురుగునీరు

చోరీకి గురవుతున్న వ్యవసాయ సామగ్రి

తలమడుగు: మండలంలోని కుచులాపూర్, పల్సి(బి) గ్రామాల్లోని రైతుల పంట పొలాల నుంచి విద్యుత్ మోటర్లు గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విట్టల్ అనే రైతు బావి దగ్గర ఉన్న రూ. 30 వేల రూపాయల బోరు మోటారు దొంగలు ఎత్తుకెళ్లారు. ఉదయం వెళ్లి చూసేసరికి మోటర్ లేదని వాపోయాడు. మరో రైతు నారాయణ పంట పోలంలోని కరెంట్ మోటర్‌ను దొంగిలించారు. గత రెండు సంవత్సరాలుగా వ్యవసాయ పనిముట్లు పైపులు, విద్యుత్ తీగలు, చోరీకి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



మోటార్ దొంగిలించారని చూపుతున్న రైతు

ప్రజల గుండెల్లో సీఆర్ఆర్ చిరస్మరణీయుడు



సీఆర్ఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: దివంగత మంత్రి, నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చిలుకూరి రామచంద్రారెడ్డి నిరుపేదల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచిపోయారని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. సీఆర్ఆర్ వర్ధంతి వేడుకలను ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవాభవన్‌లో ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ సిద్ధాంతాల కోసం జీవితాంతం శ్రమించిన గొప్ప నాయకుడు సీఆర్ఆర్ అని కొనియాడారు. ఆదిలాబాద్ పట్టణంలోని వేలాది మంది పేద ప్రజలకు ఇంటి స్థలాలు అందించిన గరీబోళ్ల నాయకుడిగా గుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో జీసీసీ చైర్మన్ కొట్నాక తిరుపతి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా ప్రజలు మరిచిపోలేని మహానేత దివంగత చిలుకూరి రామచంద్రా రెడ్డి అని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సీఆర్ఆర్ ద్వితీయ వర్ధంతి కార్యక్రమాన్ని మావలలోని శ్రీకాంత్ రెడ్డి నివాసంలో ఆదివారం నిర్వహించారు. సీఆర్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు., తన జీవితం మొత్తం ప్రజా సేవకే అంకితం చేసి, చివరి క్షణం వరకు జిల్లా ప్రజల బాగోగుల కోసమే పనిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో ధర్మపురి చంద్రశేఖర్, షేక్ ఇమామ్, వేముల నాగరాజు, అట్ల గోవర్ధన్ రెడ్డి, షేక్ అలీం, మర్సుకోల గౌతమ్, నలి మేల నవీన్ రెడ్డి, కుదురుపాక సురేశ్, బండి చారి, విజయ్, మాధవ్ పాల్గొన్నారు.



ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

జైనథ్ కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయం పక్కన గల అంబేడ్కర్ సంఘ భవనం సమీపంలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. స్తంభం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. - జైనథ్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కై లాస్‌నగర్: ఆదిలాబాద్ నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.5.27లక్షల విలువైన చెక్కులను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. జైనథ్ మండలం కంత గ్రామానికి చెందిన గడ్డం అమ్మక్కకు, బేల మండలం సాంగిడికి చెందిన బేదొడ్కర్ అనిత, జిట్టావార్ లింగమ్మకు, అవాల్ పూర్‌కు చెందిన జక్కుల యోగేష్, బేల మండల కేంద్రానికి చెందిన కండెవార్ రవీందర్‌కు రూ.60వేలు, పలాయ్ తండాకు చెందిన చవాన్ సరాబాయ్‌కి రూ. 60వేలు, దస్నాపూర్‌కు చెందిన చింతల స్వరాజ్ గౌడ్‌కు రూ. 60వేలు, జైనథ్ మండలం కాన్పమేడిగూడకు చెందిన క్యాత పద్మకు రూ. 60 వేలు, భోరజ్ మండలం గూడకు చెందిన సూరం రజిత కు రూ. 22,500, కాప్రికి చెందిన ఏనుగు లచ్చారెడ్డికి రూ. 25వేల విలువ గల చెక్కులను స్థానిక ప్రజాసేవభవన్‌లో పంపిణీ చేశారు. సీఎంఆర్ఎఫ్ సాయం కోసం తన క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు

తాంసి: రానున్న ఎన్నికల్లో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణీందర్ అన్నారు. ఆదివారం మండలంలోని పొన్నారి గ్రామంలో పోలీస్ సిబ్బందితో కలిసి పోలీస్ విలేజ్‌మార్చ్ నిర్వహించారు. గ్రామంలో ప్రధాన వీధుల గుండా తిరుగుతూ శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో నేరాలు జరగకుండా ముందస్తు నిఘా ఉంచామన్నారు. కార్యక్రమంలో తాంసి ఏఎస్సై ఉత్తమ్, కానిస్టేబుల్ సాగర్, సాయి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ ఫణీందర్

కార్మికుల వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న అన్నమొల్ల కిరణ్, నాయకులు

ఉట్నూర్‌రూరల్: గ్రామ పంచాయతీల కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొక్కల కిరణ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కొలాం భవనంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. అనంతరం ఉట్నూర్ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఆత్రం సోనేరావు, ప్రధాన కార్యదర్శిగా ఆత్రం సుందర్, కోశాధికారిగా అర్కా వెంకట్రావు, ఉపాధ్యక్షుడిగా గంగారం, బాజీరావు, గంగమ్మ, అరవింద్, సహాయ కార్యదర్శులుగా రాంషో, సంతోష్, ప్రభాకర్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు బొజ్జ ఆశన్న, ఆర్. సురేందర్, సోనేరావు సుందర్, వెంకట్రావు, బాజీరావు, గంగారం, గోవింద్ సంతోష్, ప్రభాకర్ పాల్గొన్నారు.